
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం, మే 19, 2026 పేజీలు :7







## దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

-ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి





# దాహం తీరేదెలా?

- రూ. లక్షల వ్యయంతో నీటి తొట్టెల నిర్మాణం
- నీరులేక నిరుపయోగం
- దాహంతో అల్లాడుతున్న మూగజీవాలు

ఎండలు మండిపోతున్నాయి. చెరువులు, వాగుల్లో నీరు ఇంకిపోతున్నాయి. గ్రామాల్లో పశు గ్రాసం, నీరు దొరకక మూగజీవాలు దాహంతో అలమటిస్తున్నాయి. ప్రభుత్వం పశువుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు అధికారుల అవగాహన లేమితో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అవసరంలేని ప్రదేశాలు, నీటివసతి లేని స్థలాల్లో నిర్మాణాలు చేపట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన నీటితొట్టెలు నాసిరకంగా ఉండడంతో ఏళ్లు గడవకముందే పగుళ్లు తేలి ప్రజాధనం మట్టిపాలవుతోంది. గ్రామాల్లో ఉన్న బోర్ల ద్వారా నీటిసరఫరా చేయాల్సిన పంచాయతీ అధికారు లు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది

### ఈ నెల 18 నుంచి 23 వరకు
### పర్యాటక, క్రీడా యువజన
# వారోత్సవాలు

- పోస్టర్లు, బ్రోచర్లను ఆవిష్కరించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, మే 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు జిల్లాలో పర్యాటక వారోత్సవాలు, క్రీడా -- యువజన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్‌పర్సన్ ఖుష్బూ గుప్తా

### టూరిజం వీక్ సెలబ్రేషన్స్
## పోస్టర్లు,కరపత్రాల విడుదల



గద్వాల మే 18(ప్రజా జ్యోతి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న టూరిజం వీక్ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన గోడపత్రికలు,కరపత్రాలను సోమవారం ఎంపీ మల్లు రవి విడుదల చేశారు.కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు,ఎస్పీ శ్రీనివాసరావు,ఇన్‌చార్జి డీవైఎస్‌వో రామలింగేశ్వర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లమలలో విజయవంతంగా
# మాక్ డ్రిల్

- -అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనకు మాక్ డ్రిల్
- -నల్లమల్లలో విపత్తు నిర్వహణపై భారీ స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్
- -ప్రజల రక్షణే లక్ష్యంగా అటవీ ప్రాంతంలో మాక్ డ్రిల్
- -జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



# దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

నాగర్ కర్నూల్ :మే 18 (ప్రజా జ్యోతి)
దివ్యాంగుల విద్యార్థుల సంక్షేమం,వారి విద్యా హక్కుల పరిరక్షణకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని దివ్యాంగ విద్యార్థుల విద్యాభి వృద్ధి,స్వయం సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని
ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి అన్నారు.సోమవారం
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన
ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 81 మంది దివ్యాంగ విద్యార్థులకు 14 రకాల 108 ఉపకరణాలు,సహాయక కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీల్‌చైర్లు,హియరింగ్ ఎయిడ్స్, ట్రైసైకిళ్లు,వాకర్లు, విద్యా సామగ్రి ఉపకరణాలను అందజేశారు.ఈ
సందర్భంగా విద్యార్థులు,వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సమాజంలో దివ్యాంగులు ఎదుర్కొనే ఇబ్బందులను ప్రభుత్వం గమనిస్తోందని,వారికి అన్ని విధాల అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.దివ్యాంగులు కూడా సమాజంలో సమాన హక్కులతో జీవించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విద్య,ఉపాధి,
వైద్య సేవలు,పునరావాసం వంటి రంగాల్లో ప్రత్యేక పథకాల ద్వారా దివ్యాంగులకు ప్రోత్సాహం అందిస్తున్నామని,దివ్యాంగ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వం ఇచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగ పిల్లలకు కూడా నాణ్యమైన విద్య, అవసరమైన ఉపకరణాలు అందించేందుకు దృష్టి సారిస్తున్నామని అన్నారు.అనంతరం జిల్లా విద్యా
ధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల కోరకు రాష్ట్ర ప్రభుత్వం "నా విద్య"
అనే కార్యక్రమం ద్వారా ప్రత్యేక సేవలందిస్తుందని విద్యార్థులకు స్కాలర్షిప్‌లు,ఫిజియోథెరపీ సేవలు, ప్రత్యేక శిక్షణతో పాటు అవసరమైన విద్యా సహాయక ఉపకరణాలను అందిస్తున్నామని
దివ్యాంగ విద్యార్థులు సాధారణ విద్యతో పాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.
ఈ.కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు,విద్య కో–ఆర్డినేటర్ వెంకటయ్య, వెంకటేశ్వర శెట్టి,ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్,ఉపాధ్యాయులు,దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.
29


# దాహం తీరేదెలా?

జిల్లాలోని 15 మండలాల్లో దాదాపు ఎనిమిది లక్షలకు పైగా మూగజీవాలు ఉన్నాయి. వేసవి కాలంలో గ్రామాల సమీపంలోని వాగులు, ఒర్రెలు, చెరువులు ఎడారులుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి దాహార్తి తీర్చేందుకు 2013లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఒక్కోదానికి 14,000 రూపాయలు వెచ్చించింది. జిల్లావ్యాప్తంగా 428 నీటి తొట్టెలు నిర్మించారు. వీటి నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలకు అప్పగించారు. కొన్నిచోట్ల వినియోగంలో లేక శిథిలావస్థకు చేరుకోగా మరికొన్ని చోట్ల ఒక్కరోజు కూడా వీటిలో నీరు నిల్వచేసిన దాఖలాలు లేవు. దీంతో మూగజీవాల దాహం తీరక లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యాయి. జిల్లావ్యాప్తంగా నీటితొట్టెలు నిరుపయోగంగా ఉండడంతో ఇంటి పరిసర ప్రాంతాల్లో, అక్కడక్కడ నిల్వ ఉన్న మురుగునీటితో మూగజీవాలు దాహార్తి తీర్చుకుంటున్నాయి

# ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల ధ్యేయం

### ప్రజావాణిలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా

వనపర్తి, మే18, ప్రజల సమస్యలను నేరుగా విని, వాటికి తక్షణ పరిష్కారం చూపడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యతని వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పది మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా వనపర్తి అదనపు ఎస్పీకి వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసే నమ్మకమైన వేదికగా మారిందన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు.ప్రజలు పోలీసు శాఖపై విశ్వాసం ఉంచి, తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజావాణిలో మొత్తం పది ఫిర్యాదులు రాగ అందులో రెండు భార్యాభర్తల వివాదాలకు సంబంధించినవని, మూడు భూ తగాదాలకు సంబంధించినవి,ఐదు పరస్పర గొడవలకు సంబంధించిన పిర్యాదులు వున్నాయి.



### ఈ నెల 18 నుంచి 23 వరకు

### పర్యాటక, క్రీడా యువజన

# వారోత్సవాలు

తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్లో "టూరిజం వీక్", "యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్" పోస్టర్లు, బ్రోచర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతాభావం పెంపొందించడం, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరు రోజుల పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో యువజన సంఘాలు, క్రీడాకారులు, విద్యార్థులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. మే 18న "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" కార్యక్రమంతో వారోత్సవాలు ప్రారంభమయ్యాయని, జిల్లా స్థాయిలో 5 కిలోమీటర్ల మారథాన్, యోగా, ధ్యానం, ఏరోబిక్స్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో 2 కిలోమీటర్ల వాక్‌థాన్‌లు, యోగా కార్యక్రమాలు కూడా నిర్వహించారని చెప్పారు. మే 19న "కెరీర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ డే" సందర్భంగా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ అవకాశాలు,
అగ్నివీర్ నియామకాలపై వర్చువల్ సెషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మే 20న "యూత్ లీడర్‌షిప్ సమ్మిట్"లో యూత్ పార్లమెంట్, చిత్రలేఖన పోటీలు స్టేడియం గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.
మే 21న "ప్లే అండ్ పార్టిసిపేట్ -- స్పోర్ట్స్ డే"గా జిల్లా స్టేడియంలో అథ్లెటిక్స్, బాడ్మింటన్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మే 22న "సర్వ్ అండ్ సపోర్ట్ -- క్లీన్ తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా క్రీడా మైదానాలు, పార్కులు, చెరువుల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మే 23న ఉద్యోగ సాధన కార్యక్రమంలో భాగంగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేయడంతో పాటు సీఎం కప్ – – 2025 విజేతలకు, క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా మే 19న కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద టూరిజం అవేర్‌నెస్ డ్రైవ్, మే 20న పిల్లల మర్రి మ్యూజియం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 21న యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్లతో సమావేశం, మే 22న స్వచ్ఛత డ్రైవ్, మే 23న టూరిజం బ్రాండ్ కిట్ పోస్టర్ విడుదల, టూరిజం క్విజ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
జిల్లాలోని యువత, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి మరియు జిల్లా పర్యాటక అధికారి జె. రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డీపీఆర్వో పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నల్లమలలో విజయవంతంగా

# మాక్ డ్రిల్

నాగర్ కర్నూల్ :మే 18(ప్రజా జ్యోతి)
వరదలు,విపత్తులు,అటవీ అగ్ని ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై జిల్లా యంత్రాంగం సన్నద్ధతను పరీక్షించే ఉద్దేశంతో సోమవారం నల్లమల్ల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని రాసమల్లబావి,వట్టువర్లపల్లి,బ్రహ్మగిరి ప్రాంతాల్లో భారీ స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్ విజయవంతంగా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆధ్వర్యంలోజరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి (ఐఎఫ్ఎస్) నోడల్ అధికారిగా వ్యవహరించారు. వాస్తవ అగ్ని ప్రమాద పరిస్థితులను పోలిన సన్నివేశాలను సృష్టించి,వివిధ శాఖల మధ్య సమన్వయం,స్పందనా సమయం,రక్షణ చర్యల అమలు సామర్థ్యాన్ని సమగ్రంగా పరీక్షించారు.
జిల్లా యంత్రాంగం విపత్తుల నిర్వహణలో పూర్తి స్థాయిలో సమాయత్తంగా ఉందని మాక్ డ్రిల్ ద్వారా ప్రయోగాత్మకంగా నిరూపితమై ప్రాణ,ఆస్తి నష్టాన్ని నివారించేలా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను తలపించాయి.డ్రోన్లు,అంబులెన్స్‌లు,
అగ్నిమాపక శకటాలు,అత్యాధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించింది. ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు,జిల్లా లోని వివిధ
శాఖల అధికారులు సమన్వయంతో పాల్గొన్నారు.మాక్ డ్రిల్లో భాగంగా రాసమల్లబావి వద్ద స్టేజింగ్ ఏర్పాటు చేసి సిబ్బంది,వాహనాల రిజిస్ట్రేషన్ మరియు పంపిణీ ప్రక్రియను నిర్వహించారు. అటవీ అంచు ప్రాంతంలో ఇన్సిడెంట్ కమాండర్ పోస్ట్ ఏర్పాటు చేసి +ఎ ఆధారిత మ్యాపింగ్ తో పరిస్థితిని పర్యవేక్షించారు.కార్యక్రమంలో అటవీ అధికారులతో పాటు అగ్ని నియంత్రణ నిపుణులు పాల్గొని,అటవీ అగ్ని ప్రమాదాల కారణాలు,వాటి వేగంగా వ్యాప్తి చెందే విధానం,ముందస్తు జాగ్రత్త చర్యలపై వివరించారు.వట్టువర్లపల్లి ప్రభుత్వ హైస్కూల్,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రిలీఫ్ �œ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి అగ్ని ప్రమాదం వల్ల తరలించబడిన గ్రామస్థులకు సహాయక చర్యలు ఎలా అందించే విధానం ప్రదర్శించి,స్పందనా బృందాల కోసం క్యాంప్, మెడికల్ ఎయిడ్ పోస్ట్,ట్రయాజ్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్య సేవ నిర్వహణను పరీక్షించారు.ఈ డ్రిల్ లో అటవీ శాఖ,పోలీస్,అగ్నిమాపక,రెవెన్యూ, వైద్య œ ఆరోగ్య,రవాణా,రోడ్లు œ భవనాలు, విద్యుత్,పంచాయతీరాజ్ శాఖలు పెద్ద ఎత్తున పాల్గొని ఫైర్ లైన్ల ద్వారా మంటలను అదుపు చేయడం,పోర్టబుల్ పంపుల ద్వారా నీటి సరఫరా, ఫైర్ లైన్ల నిర్మాణం,గ్రామస్థుల తరలింపు వంటి చర్యలను సమన్వయంతో నిర్వహించారు.ఎన్‌హెచ్765 పై ట్రాఫిక్ నియంత్రణ,అత్యవసర వాహనాల రాకపోకల నిర్వహణను ప్రదర్శించారు.అటవీ సిబ్బంది భద్రత కోసం లూకౌట్స్, కమ్యూనికేషన్స్, ఎస్కేప్ రూట్స్,సేఫ్టీ జోన్స్ (లాకూలా) విధానాన్ని కఠినంగా అమలు చేశారు.మాక్ డ్రిల్ అనంతరం కలెక్టర్ అన్ని శాఖల పనితీరును అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత వేగవంతమైన స్పందన కోసం సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు.అటవీ ప్రాంతాల సమీప గ్రామాల ప్రజలు,శ్రీశైలం మార్గంలో ప్రయాణించే యాత్రికులు అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే చర్యలను నివారించాలని,పొగ లేదా మంట



కనిపించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ మాక్ డ్రిల్ ద్వారా అటవీ అగ్ని ప్రమాదాల నియంత్రణలో విభాగాల సమన్వయం,అత్యవసర స్పందన, ప్రజల రక్షణ చర్యల సామర్థ్యాన్ని సమగ్రంగా పరీక్షించినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమం లో అదనపు కలెక్టర్ దేవ సహాయం,అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి గిరిధర్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు,డిఎస్పి శ్రీనివాసులు,వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చిన్నంబావి 2 కే రన్

## -యోగ, వాకింగ్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్






**చిన్నంబావి మే 18 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల భాగంగా సోమవారం చిన్నంబావి మండల కేంద్రంలో భారీ స్థాయిలో 2కే రన్ నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి. ఎంపిడిఓ. సూర్ణ ఆదర్శ్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులతో పాటు మండల స్థాయి పంచాయతీ కార్యదర్శులు ,వివిధ శాఖల అధికారులు, అంగన్ వాడి టీచర్స్ తో కలిసి2 కే రన్ నిర్వహించి ఆరోగ్యంపై ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... శారీరక దృఢత్వానికి ప్రతిరోజు యోగతో పాటు రన్నింగ్, వాకింగ్ సాధన చేసి ఆరోగ్యాలను కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు ఎంపీఓ రామస్వామి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు కంప్యూటర్ ఆపరేటర్ సంపంగి ఈశ్వర్ నరేష్ నాయుడు సర్పంచులు, ఉప సర్పంచ్లు, గ్రామ కార్యదర్శులు 108 సిబ్బంది, అంగన్ వాడి టీచర్స్,క్రీడాకారులు, ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐకాన్ టాక్టుఫుల్ పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి








**నాగర్ కర్నూల్ : మే 18(ప్రజా జ్యోతి)**

తిమ్మాజిపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఐకాన్ టాక్టఫుల్ పాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.అనంతరంపాఠశాల ప్రాంగణాన్ని,విద్యార్థులకు అందిస్తున్న విద్యా సదుపాయాలు,ఆధునిక తరగతులను, మౌలిక వసతులను పరిశీలించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ,నాణ్యమైన విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు మారుతుందని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా పట్టణ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ఇటువంటి విధ్యా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని, ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా,క్రమశిక్షణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు,సాంకేతిక పరిజ్ఞానం కూడా అలవర్చుకోవాలని,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తుందని,ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు కలిసి విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.ఈకార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ వివేక్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామ్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య,బహుదూర్ శ్రీనివాస్,లక్ష్మి నారా యణ,ప్రజా ప్రతినిధులు,సంస్థ నిర్వాహకులు, ఉపాధ్యా యులు,విద్యా ర్థులు,తల్లిదండ్రులు,పార్టీ నాయకులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అసంపూర్తి రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

## సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నేత ఎం.హన్మేష్

**నారాయణపేట ప్రతినిధి మే 18 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లాలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నారాయణపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.హన్మేశ్ మాట్లాడుతూ... గత నాలుగు సంవత్సరాల క్రితం డబల్ రోడ్డు నిర్మాణం కోసం బొమ్మన్ పాడు నుండి అప్పక్ పల్లి వరకు రోడ్డును తవ్వి అలాగే వదిలేసారని జాయింట్ కలెక్టర్ గారి వివరించినట్టు తెలిపారు. గుంతల మయమైన ఆ 4 కిలోమీటర్ల రహదారిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని, రానున్న వర్షాకాలంలో ప్రయాణం మరింత దుర్భరంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కోటకొండ నుండి వింజమూరు మధ్యన 6 కిలోమీటర్ల మేరకు కూడా రోడ్డును నిర్మించకుండా అలాగే వదిలేసారని తెలిపారు. కోయిలకొండ వాగు దగ్గర రెండు కిలోమీటర్ల రహదారి తో పాటు బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా అలాగే వదిలేసారని ఆయన తెలిపారు. ఈ అసంపూర్తి రోడ్లను త్వరితగతిన పూర్తిచేయాలని, లేనిపక్షంలో సిపి ఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు హాజీ, వెంకట్రాములు, వార్డు మెంబర్ రఫీ, నారాయణ, చెన్నారెడ్డి, హన్మంతు, పిఓడబ్ల్యు నాయకురాళ్లు జయ, సరళ, సునీత, కోటకొండ, అభంగాపూర్, తిరుమలపూర్, బొమ్మన్ పాడు ఆటో యూనియన్ నాయకులు రవి, మహబూబ్, ఆంజనేయులు, రాములు తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.



# ఘనంగా సర్వోదయ మండల్ మహాసభలు - నూతన కమిటీల ఏకగ్రీవ ఎన్నిక







**నాగర్ కర్నూల్ : మే 18 (ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ (ఖుఖీ) భవనంలో నాగర్‌కర్నూల్ జిల్లా సర్వోదయ మండల్ మహాసభలు అత్యంత ఉత్సాహభరితంగా జరిగాయి.ఈ మహాసభలఅనంతరం తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల్ అధ్యక్ష,కార్యదర్శులను ఎన్నుకున్నారు.శంకర్ నాయక్,గిరిప్రసాద్ ల సమక్షంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని,జిల్లా మహిళా,యువజన సంఘాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సర్వోదయ మండల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా హెచ్.నవీన్, ప్రధాన కార్యదర్శిగా ఏ.వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఇతర కార్యవర్గ సభ్యులుగా జిల్లా ప్రతినిధిగా జూపల్లి రాములు,ఉపాధ్యక్షులు గా శివశంకర్,చిన్న స్వామి,సహాయ కార్యదర్శులుగా బి.నాగయ్య, ఎన్.రాముయాదవ్,కోశాధికారి గా జగపతి,కార్యవర్గ సభ్యులుగా గోపి,పాండయ్యమరో ఇద్దరు కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.అదేవిదంగా మహిళా విభాగం బలోపేతానికి జిల్లా అధ్యక్షురాలిగా ప్రవీణ,ఉపాధ్యక్షురాలిగా శశికళ,కార్యదర్శిగా రాణి,సహాయ కార్యదర్శిగా శివానిఎన్నికయ్యారు.యువజన సంఘం జిల్లా కమిటీజిల్లా అధ్యక్షునిగా శ్రీనివాసులు,జిల్లా కార్యదర్శిగా ఎన్.వెంకటేష్ లు ఎన్నికయ్యారు

# కాకతీయ హై స్కూల్ విద్యార్థుల ఘన విజయం

## -అభినందించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : మే 18 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూలు పట్టణంలోని కాకతీయ హై స్కూల్ విద్యార్థులు మరియు ఖా జూర్రాజజు పరీక్షలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు.మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో గత కొన్ని సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా ఒకే పాఠశాల నుండి నలుగురు విద్యార్థులు 99 % పై మార్కులు సాధించి రికార్డు సృష్టించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.విద్యార్థుల కృషి,ఉపాధ్యాయుల అంకితభావం,తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే విజయాలు సాధ్యమయ్యాయని భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత లక్ష్యాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, కౌన్సిలర్లు నిజాం, కూచుకుళ్ల సింధు, మాధవి రాజు, పద్మమ్మ, శ్రీనివాసులు, పి. రాజేశ్వరి, మాజీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ హరీశ్ గౌడ్, స్కూల్ డైరెక్టర్లు పాలమూరు సతీష్, మల్లికార్జున్, రామకృష్ణ, అంజాద్ అలీ, జహంగీర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన విద్యా వారోత్సవాలు

**నాగర్ కర్నూల్ : 18 మే (ప్రజా జ్యోతి)**

జిల్లా వ్యాప్తంగా మే 11 నుండి 17 వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "విద్యా వారోత్సవాలు" ఆదివారం కలెక్టరేట్‌లోని ఐ డి ఓ సి సమావేశ భవనంలో ఘనంగా ముగిశాయి.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం,ప్రభుత్వ పాఠశాలలలో నమోదు సంఖ్య పెంపు,బోధన నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంగా వారోత్సవ

కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల ద్వారా విద్యా రంగ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను అమలు చేయడం జరిగిందని,పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు,ప్రశంసా పత్రాలు అందజేయడం,ఇంటర్మీడియట్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కూడా అభినందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను రెండో స్థానంలో నిలిపినందుకు జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ ను,విద్యా శాఖను అభినందించి వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రం మొత్తంలో మొదటి స్థానాన్ని సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,కేజీబీవీ విద్యాలయాలు కార్పొరేట్ స్థాయికి ఎదిగేలా అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఫలితాల సాధనకు అనుసరించిన వ్యూహాలను మరింత బలోపేతం చేసి వచ్చే సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించేందుకు కృషి చేస్తామని విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం విద్యా వారోత్సవాల్లో విభిన్న కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.ఈ



వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు జిల్లాలో 17 పాఠశాలల్లో సమ్మర్ క్యాంప్స్ ప్రారంభించగా, రెండవ రోజు పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెండు పాఠశాలల్లో రెమెడియల్ తరగతులు ప్రారంభించారు.మూడవ రోజు నియోజకవర్గ స్థాయిలో సర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్లకు విద్యాశాఖపై అవగాహన సదస్సులు నిర్వహించి నాలుగవ రోజు బడిబాట కార్యక్రమం, మెగా ర్యాలీ ద్వారా విద్యార్థుల నమోదు పెంపు చర్యలు చేపట్టారు.ఐదవ రోజు లైబ్రరీ డే,ఆరవ రోజు కళావైభవం (సాంస్కృతిక కార్యక్రమాలు) నిర్వహించగా,ఏడవ రోజు విద్యా విజయోత్సవం ఘనంగా నిర్వహించి వారోత్సవాలు ముగించారు.

ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, పరీక్షల విభాగం అధికారి రాజశేఖర్ రావు, సెక్టోరియల్ అధికారులు,విద్యాశాఖధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు,విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మాయిపల్లిలో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



## రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి : బగ్గారి నరసింహారెడ్డి

**చిన్నంబావి, మే 18 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ మాధగౌని కవిత ప్రభంజన్ గౌడ్, ఉపసర్పంచ్ ఆరెపల్లి మాధవి మాధవరెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహా రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయిస్తే నష్టాలు తగ్గి లాభాలు పెరుగుతాయని తెలిపారు.అమ్మాయిపల్లి గ్రామ రైతులకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రైతుల ధాన్యాన్ని సమయానికి కొనుగోలు చేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.రైతులు ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా శు భ్రపరచి తీసుకురావాలని సూచించిన ఆయన, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తామని తెలిపారు.గ్రామ సర్పంచ్ మాధగౌని కవిత ప్రభంజన్ గౌడ్ మాట్లాడుతూ రైతులు తమ పంటను మధ్యవర్తులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. రైతులు తీసుకొచ్చే ధాన్యానికి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం శుభ్రంగా ఉండటంతో పాటు తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దర్గయ్య, పావని కవీందర్ గౌడ్, మహేశ్వరమ్మ సత్యారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ గౌడ్, సుకుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, రైతులు, గ్రామ పెద్దలు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు

**కృష్ణ (ప్రజా జ్యోతి) మే/18/2026/**

నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక సోమవారం కృష్ణ మండల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా మండలంలోని పలు అభివృద్ధి పనులు, చారిత్రక ప్రదేశాలను ఆమె పరిశీలించారు.మొదట వాసు నగర్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన విపత్తు నిర్వహణ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం, వరదల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రమాదాల నివారణపై నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు.అనంతరం కృష్ణ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి, ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు.తదనంతరం ముడుమల్ గ్రామంలోని బృహత్ శిలా యుగం నాటి చారిత్రక నిలువురాళ్లను కలెక్టర్ సందర్శించారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం నాటి ఈ ఖగోళ వారసత్వ సంపదను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా స్థాయి అధికారులు, తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆయా శాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## పోలీస్ అధికారులు అంకితభావంతో పనిచేయాలి

### -జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

**నాగర్ కర్నూల్ : మే 18(ప్రజా జ్యోతి)**



పోలీస్ అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్‌పాటిల్ అన్నారు.ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన సబ్ ఇన్స్పెక్టర్ ల బదలీలలో జిల్లాకు కేటాయించిన నూతన ఎస్సైలు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సంగ్రామ్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.వీరిలో తెల్కపల్లి కి నూతనంగా కేటాయించిన ఎస్సై రమేష్,వంగూరుఎస్సై మాధవరెడ్డి,ఉప్పునుంతల ఎస్సై మహేష్, బిజినపల్లి ఎస్సై శంషుద్దీన్,తిమ్మాజీపేట ఎస్సై శ్రీనివాసరావు లు ఉన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ అధికారులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజాభిమానాన్ని పొంది నిజాయితీతో విధులు నిర్వహిస్తూ,బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ,పోలీస్ స్టేషన్లో న్యాయం జరుగుతుంది అనే నే నమ్మకాన్ని బాధితులకు కలిగించాలని నూతన సబ్ ఇన్స్ స్పెక్టర్ల కు దిశా నిర్దేశం చేశారు.

## పోలీస్ ప్రజావాణికి 5 వినతులు

**నాగర్ కర్నూల్ : మే 18(ప్రజా జ్యోతి)**



పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రజా వాణిలో ఫిర్యాదు దారుల నుండి 05 ఫిర్యాదులను జిల్లా ఎస్పీసంగ్రామ్ సింగ్ పాటిల్ స్వీకరించి ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం తక్షణమే పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు.ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 05 అర్జీలలో భూమికి సంబంధించివి 02,తగు న్యాయం సంబంధించిన అర్జీలు 02,
భార్య భర్తల పంచాయతీ 01 స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుకు సూచనలు చేసి,ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం గాని,పైరవీలు లేకుండా
పోలీస్ సేవలు వినియోగించుకుంటూ సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

## బీచుపల్లి కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఎస్డీఆర్ఎఫ్ మాక్ డ్రిల్

గద్వాల (ప్రజా జ్యోతి) మే 18:జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లి కృష్ణానది పరివాహక ప్రాంతంలో వరదల సమయంలో ప్రజలు అప్రమత్తత కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించింది.బీచుపల్లి పుష్కర ఘాట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వరదలు,విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.తహసీల్దార్ నరేష్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలు భయపడకుండా అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్,వైద్య,వెటర్నరీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పదో తరగతి ప్రతిభావంతుల విద్యార్థులకు ప్రతిభా పురస్కార సన్మానం

**మహబూబ్‌నగర్, మే 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :** బహుజన మహనీయుల శోభయాత్ర ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార సన్మానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడు చిత్రపటానికి పూలు సమర్పించి పంచశీల దీపాలను వెలిగించారు. అనంతరం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. సభకు పాతూరి రమేష్ అధ్యక్షత వహించగా, కే. రవి ప్రకాష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే అణగారిన వర్గాలకు విద్య అందించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. అదే మార్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడా ఎన్నో అవమానాలు ఎదుర్కొని విద్య ద్వారానే చీకటి నుంచి వెలుగులోకి రావచ్చని చాటిచెప్పారని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు, హక్కులు కల్పించి సామాజిక న్యాయానికి బాటలు వేశారని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇంతకాలం గుర్తింపు పొందని మాదిగ విద్యార్థుల ప్రతిభను బహుజన మహనీయుల శోభయాత్ర కమిటీ గుర్తించి, మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించడం అభినందనీయమన్నారు. మొత్తం 22 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ కార్యక్రమంలో సన్మానం పొందారు. ఉన్నత విద్యను అభ్యసించి మరింత ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆది



రవీంద్రబాబు, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, పదవ డివిజన్ కార్పొరేటర్ టి. రమేష్ బాబు పాల్గొన్నారు. అలాగే బహుజన కుల సంఘాల ప్రతినిధులు సింగిరెడ్డి పరమేశ్వర్, రాయికంటి రాందాస్, సారంగి లక్ష్మీకాంత్, ఎర్ర నరసింహ, బోయ వాల్మీకి, నేతరి చిన్న కృష్ణన్న, సుంకసారి చంద్రశేఖర్, గంధం నాగరాజు, తూకల హనుమయ్య, కాశీపోగు దేవన్న, గుమ్మడి శ్రీవల్లి, బొర్ర సురేష్, కాలే నరేందర్, సందీప్ యాదవ్, రామకృష్ణ, డి. కృష్ణ, శాంతయ్య, జి. నాగరాజు, కొమ్ము తిరుమలయ్య, తిరుమలేష్, ఏ. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఈదమ్మగుడి బస్తి హిందూ సమ్మేళనం






**నాగర్ కర్నూల్ : మే 18(ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఈదమ్మ గుడి కాలనీలో సోమవారం జరిగిన ఈదమ్మ గుడి బస్తి హిందూ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఓం భారత్ శక్తి పీఠం వ్యవస్థాపకులు గురూజీ భారత నంద మహారాజ్ ముఖ్య వక్తగా,విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బిల్లకంటి భానుప్రకాష్ రావు,కార్యదర్శి గుళ్ళ రమేష్ కౌన్సిలర్లు కొత్త గంగాధర్,తిమ్మాజిపేట పాండు,ముమ్మడి విజయలక్ష్మిలు హాజరై మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం హిందూ ఐక్యతకు సూచిక అని నేటి సమాజంలో పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని,పుడమి సంరక్షణ మన ధ్యేయమని అన్నారు.ప్లాస్టిక్ వస్తువులు తగ్గించి పర్యావరణ సంరక్షణ చేయాలని,దేశీయ ఉత్పత్తుల వినియోగం పెంచాలన్నారు.సమిష్టి కుటుంబ ఎంతో అవసరమని స్త్రీ శక్తి బలోపేతం చేయాలన్నారు.అనంతరం కాలనీ చిన్నారులచే సంస్కృత కార్యక్రమాలు నిర్వహించి సమ్మేళనంలో పాల్గొన్న వారికి భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివ,సుభాష్,లక్ష్మీనారాయణ,శేఖర్ బాబు,అంజి, శ్రీను,అనిల్,నిఖిల్,వినయ్,సంతోష్, నాగరాజు,రవి,శ్రీనివాస్ రావు,నాగలక్ష్మి,ప్రసన్న, మంజుల,విజయ,కరుణాకర్,సుమన్,వేలాదిగా హిందువులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

## - సానిటేషన్, పార్కులు, డంపింగ్ యార్డు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**జడ్చర్ల, మే 18 ( ప్రజా జ్యోతి ) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, ప్రజా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన మున్సిపల్ కమిషనర్ పట్టణంలోని పలు ప్రాంతాలను సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సానిటేషన్ నిర్వహణ, పార్కుల పరిస్థితి, డంపింగ్ యార్డు నిర్వహణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణంలో పరిశుభ్రతను మరింత మెరుగుపరచాలని, చెత్త సేకరణ ప్రక్రియను క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పారిశుధ్య కార్మికులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, అదనపు కలెక్టర్, పురపాలక సంఘం ప్రత్యేక అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య చర్యలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించినట్లు సమాచారం. ఇక ఎంపీడీవో కార్యాలయానికి ఆనుకుని ఉన్న రహదారిపై జరిగిన అక్రమ ఆక్రమణలను కమిషనర్ స్వయంగా పరిశీలించి వెంటనే తొలగింపచేశారు. రహదారులపై ఆక్రమణలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ఇటువంటి అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత, ట్రాఫిక్ సౌకర్యాల మెరుగుదలకు మున్సిపాలిటీ నిరంతరం చర్యలు చేపడుతుందని కమిషనర్ పేర్కొన్నారు.



# రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

## -ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : మే 18 (ప్రజా జ్యోతి)** తాడూర్ మండల పరిధిలోని మేడిపూర్ గ్రామంలో సోమవారం రాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,రైతులకు సరైన ధరలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,ఇలాంటి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు బలోపేతమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు,రాజా చైర్మన్ రామచంద్ర రెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్,మండల్ అధ్యక్షులు యర.రమేష్,సర్పంచ్ మల్లయ్య,డైరెక్టర్లు,రైతులు, పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు

## ఒకరికి జైలు శిక్ష -- ఏడుగురికి జరిమానా



**మహబూబ్‌నగర్, మే 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డుపై ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 8 మందిని ట్రాఫిక్ పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని సోమవారం సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఆర్. శశిధర్ ఎదుట హాజరుపర్చగా, అందులో 7 మందికి ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున జరిమానా విధించారు. అదేవిధంగా ఒక ద్విచక్ర వాహనదారునికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉంటాయని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# నేడు జిల్లా కేంద్రంలోని 22వ,వార్డులో విద్యుత్ అంతరాయం

## -విద్యుత్ ఏ.ఈ మాన్య నాయక్



**నాగర్ కర్నూల్ : మే 18 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని 22వ,వార్డులో ఉదయం :9: 00గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు ఎల్.టీ లైన్ మరమ్మతుల కారణంగా ఆ వార్డు కు చెందిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ ఆఫ్ చేయనున్నందున 22వ వార్డు విద్యుత్ వినియోగదారులకు పవర్ సప్లై లో అంతరాయం ఉంటుందని అందరూ గమనించి సహకరించాలని విద్యుత్ ఏ.ఈ మాన్య నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# ప్రజా సమస్యలపై మహారాష్ట్ర ఉద్యమించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బార్.

వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్. వీపనగండ్ల చిన్నంబాయి సిపిఎం పార్టీ మండల కమిటీ ల ఆధ్వర్యంలో మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు గోపాల్ దిన్నె గ్రామంలో నిర్వహించిన సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బార్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుండి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వారు అన్నారు.ఆయిల్, గ్యాస్ సంక్షోభం వల్ల ప్రతి వస్తువుల ధరలు పెరగడం జరిగింది, ఈ మధ్యకాలంలో పెట్రోల్, డీజిల్ కూడా పెంచడం జరిగింది. బిజెపి ప్రభుత్వం ప్రజలకు బారాలు వేసే విధంగా ప్రయత్నం చేస్తుంది. కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్ లు తీసుకురావడం,వ్యవసాయంలో విద్యుత్ చట్టం, ఇతర స మస్కారనలు తీసుకురావడం ఉపాధి హామీ పథకాలు పేరు మార్చి, బడ్జెట్ తగ్గించి ఈ పథకం నిర్వీర్యం చేయాలని చూస్తుంది. నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు అవకాశాలు కల్పిస్తాను అని మోసగించడం జరిగింది. కాబట్టి కేంద్ర బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరిచి ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలు లో జరుగుతున్న సమస్యలను వెంటనే




పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికి పింఛన్లు వెంటనే ఇవ్వాలని వారు కోరారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమం నిర్వహిస్తూనే వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, జిల్లా నాయకులు ఆది, మండల కార్యదర్శి వర్గ సభ్యులు రవి ప్రసాద్, చిన్నంబాయి మండల కన్వీనర్ వెంకటేష్, మండల నాయకులు బాలు గౌడ్, వి కృష్ణయ్య, నాగరాజు, నిరంజన్, ఆశన్న, గోపాల్ దీన్ని గ్రామ ఉప సర్పంచ్ వెంకటయ్య, గ్రామ నాయకులు శేఖర్ రెడ్డి, భాస్కర్ ,చంద్రయ్య ,అబ్దుల్లా, రాముడు, రంగస్వామి గౌడ్, లక్ష్మి, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పకడ్బందీగా జరిగేలా బిఎల్ఏలు కృషి చేయాలి

## సర్ జిల్లా ఇంఛార్జి రఘువీర్ యాదవ్

**నారాయణపేట ప్రతినిధి మే 18 ప్రజా జ్యోతి**



ఎన్నికల కమిషన్ ఓట్ల ప్రక్షాళనకు నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ నారాయణపేట జిల్లాలో పకడ్బందీగా జరిగేలా బిజెపి బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది, సర్ జిల్లా ఇంఛార్జి రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి బి ఎల్ ఏ లు దగ్గరుండి అధికారులకు సహకరించాలని అన్నారు.ముఖ్యంగా దొంగ ఓట్లను తొలగించాలని,రోహిగ్యాల ఒక్క ఓటు ఉండకుండా చూడాలని,వలస వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారి ఓట్లను తొలగించాలని,చనిపోయిన వారి ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఓట్లను తొలగించాలని సూచించారు.అధికార కాంగ్రెస్,మైనార్టీ ఓట్లకు కక్కుర్తి పడే బి ఆర్ ఎస్ పార్టీలు పక్షిమ బెంగాల్ నుంచి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో రోహిగ్యాలు జొరబడుతున్నారని అట్టి వారి ఓట్ల నమోదుకు ఆపార్టీలు పని చేస్తాయని హెచ్చరించారు.దీని పట్ల ప్రతి ఏజెంట్ అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్లను నమోదు చేయకుండా అడ్డుకోవాలని కోరారు.

# జడ్చర్లలో శ్రీ దత్త హాస్పిటల్ ప్రారంభం

## ప్రారంభోత్సవంలో పాల్గొన్న జనంపల్లి శశికళ రెడ్డి

**జడ్చర్ల, మే 18 ( ప్రజా జ్యోతి ) :**

జడ్చర్ల మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ దత్త హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి జనంపల్లి శశికళ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో హాస్పిటల్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆధునిక సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రజలకు మెరుగైన చికిత్స అందించాలని ఆకాంక్షించారు.



హాస్పిటల్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం



**అడ్డాకుల, మే 18 ( ప్రజా జ్యోతి ) :**

అడ్డాకుల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ -- 2026 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగుల విజయ మోహన్ రెడ్డి, అడ్డాకుల గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డి పాల్గొని విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతిగా రూ.50 వేల నగదు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేల నగదు అందజేశారు. విజేతలు నాయకులకు, టోర్నమెంట్ నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శేఖర్ రెడ్డి, గంగుల శ్రీనివాస్ రెడ్డి, షఫీ, హనుమంత్, కాటవారం సర్పంచ్ జగదీష్, తిమ్మాయిపల్లి సర్పంచ్ మన్నెం తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో మత్తుపదార్థాల తనిఖీలు



**– 'రుద్ర' జాగిలంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన పోలీసులు**

**మహబూబ్‌నగర్, మే 18 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**

జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో సోమవారం ప్రత్యేక మత్తుపదార్థాల తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం "రుద్ర" సహాయంతో తనిఖీలు చేపట్టారురైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, సామగ్రిని జాగిలం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాల విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ యేజాజుద్దీన్, ఆర్ఐ కృష్ణయ్య తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన మద్దూర్ నూతన ఎస్సై

**నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజా జ్యోతి మే18:**



మద్దూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీనివాసులు సోమవారం నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.మద్దూర్ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ భద్రతపై భరోసా కల్పించాలని సూచించారు.అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని,ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.